నాలుగు రోజుల్లో రూ.16.50 లక్షల ఆదాయం

ఆర్టీసీ జనగామ డిపో మేనేజర్ స్వాతి

సిబ్బందిని అభినందిస్తున్న డిపో మేనేజర్ స్వాతి

జనగామ, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొమురవెల్లి జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ నా లుగు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడపడంతో జనగామ డిపోకు గణనీయమైన ఆ దాయం లభించిందని డిపో మేనేజర్ ఎస్.స్వాతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 25 నుంచి 28వ తేదీ వరకు మొత్తం 60 బస్సులు 518 ట్రిప్పులలో 23,310 కిలో మీటర్లు నడిపి 16,959 మంది ప్రయాణికులను చేరవేయడం ద్వారా రూ.16.50 లక్షల ఆదాయం సమకూరిందని ఆమె తెలిపారు. తమ సేవలను వినియోగించుకొని ఆర్టీసీని ఆదరించిన ప్రయాణికులకు స్వాతి ధన్యవాదాలు తెలిపారు. సమయానుకూలంగా బస్సులను నడిపి ప్రయాణికులకు ఆసౌకర్యం లేకుండా విధులను నిర్వర్తించిన సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, బస్సులను సకాలంలో మెయింటెనెన్స్ చేసి అందుబాటులో ఉంచిన సిబ్బంది, విధులలో పాల్గొన్న ఉద్యోగులను ఆమె అభినందించారు.

బొమ్మకూర్ జీపీకి కంప్యూటర్ అందజేత

కంప్యూటర్‌ను అందిస్తున్న చింతల యాదయ్య

నర్మెట, ఫిబ్రవరి 28: మండలంలోని బొమ్మకూర్ గ్రామ పంచాయతీకి కంప్యూటర్‌తో పాటు ప్రింటర్‌ను ఆ గ్రామానికి చెందిన న్యాయవాది చింతల యాదయ్య శుక్రవారం బహుకరించారు. గ్రామ పంచాయతీలో కంప్యూటర్ లేక ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శి సుజాత తెలుపగా యాదయ్య చేయూతనందించారు. దీంతో యాదయ్యకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

క్రీడలతో యువతకు మానసికోల్లాసం

లింగాలఘనపురం, ఫిబ్రవరి 28 : క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలుగుతుందని అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు ప్యాట రవి అన్నారు. మండల కేంద్రంలోని యువకులకు ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాడ్మింటన్ కిట్ అందించారు. రవి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, నాయకులు కుంటి రాంచందర్, మేడ తిరుమల్, చెన్నూరి మల్లేశం, ఏదునూరి నాగరాజు, రాగల్ల నరేశ్, యాకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 28 : జిల్లా కేంద్రానికి చెందిన ఓ పత్రికా విలేకరి మహ్మద్ అబిద్ ఫైసల్ ఖురేషిని అకారణంగా దుర్భాషలాడిన కాంగ్రెస్ నాయకుడు ఎండీ అజార్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పలువురు జర్నలిస్టులు అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన రంజాన్ పర్వదినం సమీక్ష సమావేశం వార్తను మున్సిఫ్ డైలీలో రాసిన ఖురేషికి కాంగ్రెస్ నాయకుడు అజార్ ఫోన్ చేసి 'ఆ సమావేశంలో నేనున్నాను, నా ఫోటో ఎందుకు పేపర్లో రాలేదు' అని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రమేశ్, భిక్షపతి, నరేందర్, శ్రీకాంత్, కిరణ్, జమాల్ షరీఫ్, ఉపేందర్, ఎజాజ్, ఉపేందర్, కృష్ణ, కార్తీక్, ఓంకార్, క్రాంతి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు సాంబరాజు

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 28 : మండలంలోని కోనాయిచలంకు చెందిన చందా సాంబరాజు జాతీయ స్థాయి సీనియర్ లెవల్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా షూటింగ్ బాల్ ఈసోషియేషన్ ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 1వ తేదీ నుంచి నల్లగొండలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో సాంబరాజు పాల్గొననున్నట్లు అన్నెపు కుమార్ తెలిపారు. సాంబరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికకు సహకరించిన అసోషియేషన్ చైర్మన్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి, అధ్యక్షుడు మంద రమేశ్, ఉపాధ్యక్షుడు బొజ్జపల్లి సుభాష్, వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్, రాజు, అనితకు కృతజ్ఞతలు తెలిపారు.

సాహితీ సంపుటిలో జనగామ శంకర్‌కు చోటు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 28 : లింగంపల్లి రామచంద్రం సంపాదకీయంలో ప్రచురితమైన సాహితీ సంపుటిలో మండలంలోని కొత్తపెల్లికి చెందిన జనగామ శంకర్‌కు చోటు లభించింది. కవి, సాహితీవేత్త లింగంపల్లి రామచంద్రం జనగామ జిల్లా సాహిత్యచరిత్ర సంపుటిని సమగ్రంగా వెలువరించారు. దీనిని శుక్రవారం రామచంద్రం చేతులమీదుగాయాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో అతిథుల నుంచి శంకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా జనగామ శంకర్‌ను స్థానికులతోపాటు పలువురు అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

WANTED TEACHERS

★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

'కులగణన'ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా ఆదేశం
- ఎంపీడీవోలతో టెలీకాన్ఫరెన్స్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 28 : జిల్లాలో మరోసారి చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (కుల గణన) వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి ఎంపీడీవోలతో డాటా ఎంట్రీ ప్రక్రియ, ఇందిరమ్మ ఇళ్లపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు కుటుంబ సభ్యుల సర్వే వివరాలు సేకరించినట్లు తెలిపారు. మున్సిపల్, గ్రామ పంచాయతీల పరిధిలో సర్వే కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలు, టోల్ ఫ్రీ నంబర్, ప్రజావాణి ద్వారా సేకరించిన దరఖాస్తుల సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జాబితాలను త్వరగా పరిశీలించి గ్రామాల వారీగా తుది జాబితాను రూపొందించాలన్నారు. జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే కారణాలుండాలని ఆదేశించారు. తుది జాబితాలో అర్హుల వివరాలు మాత్రమే ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అనర్హులను జాబితాలో చేరిస్తే ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. ఈ సమావేశంలో జనగామ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ మాత్రు నాయక్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

ఇంటర్ వార్షిక పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్‌పై జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా స్ట్రాంగ్ రూముల నుంచి పోలీస్ స్టేషన్‌లకు తరలించాలని ఆదేశించారు. అవసరమైన విధంగా చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ 2020 కింద వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రమబద్ధీకరించారని తెలిపారు. మార్చి 31వ తేదీలోపు క్రమబద్ధీకరణ చేసుకునే వారికి 25 శాతం మినహాయింపు ఉంటుందని సూచించారు. 26 ఆగస్టు 2020 వరకు 10 ప్లాట్లు విక్రయించిన లేఔట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్‌ల ద్వారా నిర్ణీత నమూనాలో కొత్త దరఖాస్తులు స్వీకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి, క్రమబద్ధీకరణ పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4251 మంది, ద్వితీ య సంవత్సరం విద్యార్థులు 4694 మంది చొప్పున మొత్తం 8945 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

మృతుడి కుటుంబానికి స్నేహితులు, పూర్వవిద్యార్థుల సాయం

మృతుడి కుటుంబానికి సాయం అందిస్తున్న స్నేహితులు

రఘునాథపల్లి, ఫిబ్రవరి 28:మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన ఇప్పోజు తిరుమలాచారి (52) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1986-87లో పదో తరగతి బ్యాచ్‌కు చెం దిన స్నేహితులు శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. తమవంతుగా తిరుమలాచారి కుటుంబానికి రూ.10 వేల నగదు, క్వింటాలు బియ్యం అందజేశారు. ఈ కార్యక్ర మంలో పూర్వ విద్యార్థులు గైని శ్రీనివాస్, బత్తిని నర్సింహులు, బానుజీ, యాదగిరి, ప్రభాకర్, రవీందర్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల : మండలంలోని పెదమడూరుకు చెందిన జోగు రవీందర్ తల్లి జోగు రాజఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న రవీందర్ స్నేహితులు, 2000-01లో చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, గొడిశాల కిరణ్, బోరెం నరేందర్, వరికుప్పల యాదగిరి, గొడిశాల వెంకటేశ్వర్లు, పాండురాజుల మధు, జుంకాల ఉపేందర్, మామిండ్ల ప్రశాంత్, చొప్పరి కుమార్, గొడిశాల సంతోష్, మునిగొండ రవి, నర్సింహాచారి, బూడిద ప్రభాకర్ పాల్గొన్నారు

బాల సదన్‌ను తనిఖీ చేసిన జడ్జి విక్రమ్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 28 : జనగామ పట్టణంలోని బాల సదన్ హోంను శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సీ విక్రమ్ తనిఖీ చేశారు. సదనంలో బాలికలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. విక్రమ్ మాట్లాడుతూ బాలికలకు రుచి, శుచితో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. బాలికలకు సమస్యలు లేకుండా అవసరమైన రక్షణ చర్యలు కల్పించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి ఆయన వివరించారు. ప్రతిఒక్కరూ చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ సిబ్బంది స్రవంతి, నివేదిత పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

లింగాలఘనపురం, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో జలేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని, టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా లేదన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పరిశీలించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు రమేశ్, ఎల్లయ్య, నర్సయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సార్.. మమ్ములను విడిచి వెళ్లొద్దు

ఇప్పగూడెం పాఠశాలలో కన్నీటిపర్యంతమైన విద్యార్థులు

మల్లారెడ్డి సార్.. వెళ్లొద్దని వేడుకుంటున్న విద్యార్థులు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 28 : 'సార్ మీరు మమ్ములను విడిచి వెళ్లొద్దు.. ఈ పాఠశాలలోనే ఉండాలి.. మాకు పాఠాలు చెప్పాలి' అని విద్యార్థులు కన్నీటిపర్యంతమైన ఉదంతం మండలంలోని ఇప్పగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇప్పగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన వట్టె మల్లారెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. 1969లో ఇదే పాఠశాలలో విద్యార్థిగా చేరిన మల్లారెడ్డి మూడేళ్ల క్రితం ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది మల్లారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కన్నీటపర్యంతమై 'సార్ మీరు పోవద్దు.. ఇక్కడే ఉండాలని..' అని వేడుకున్నారు. మల్లారెడ్డి స్పందిస్తూ ఉద్యోగ విరమణ అందరికీ ఉంటుంది, మీరు బాగా చదివి, ఈ ఊరికి, బడికి, మీ అమ్మా నాన్నలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చైతన్య, రజియా, మాలతీలత, శరత్‌బాబు, జావేద, గోవర్ధన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలి

మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి

వడ్లకొండలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు

జనగామ రూరల్, ఫిబ్రవరి 28 : దేవాదుల కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండలో ఎండిపోయిన వరి పంటను సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రాజారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. దేవాదుల రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయక పోవడంతో సాగునీరందక అనేక గ్రామాల్లో వరి, ఇతర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి నీరు రావడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పరిశీలించి సాగునీరు విడుదల చేయాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటె శ్రీశైలం, ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, చంద్రయ్య, వెంకటాద్రి, గుర్రం మధు, సుదర్శన్, ఐలయ్య, నర్సింహులు, సురేందర్‌రెడ్డి, యాదగిరి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోమల్లలో ఇసుక లారీ సీజ్

రఘునాథపల్లి, ఫిబ్రవరి 28: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసి జరిమానా విధించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బొంబాయిపల్లి చెందిన బద్దం సంజీవరెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం బొమ్మపూర్ ఇసుక క్వారీ నుంచి మెట్‌పల్లి, జగిత్యాలకు టాన్స్‌పోర్టు చేస్తామని పర్మిషన్ తీసుకొని అనుమతులు లేకుండా టీఎస్05 యూఈ 4777 నంబర్ గల లారీలో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మండలంలోని కోమల్ల టోల్‌గేట్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా ఇసుక తరలింపునకు సంబంధించి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రూ.50 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై నరేశ్‌యాదవ్ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

సీవీ రామన్ జయంతి వేడుకల్లో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ స్కూళ్లలో ఎగ్జిబిట్స్, చిత్రాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

తరిగొప్పులలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 28 : ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ భారతీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు, ట్రాఫిక్ నియంత్రణ, వర్షపునీటిని నిల్వ చేసే వి ధానం, గాలి కాలుష్యం అరికట్టడం, ఇంటి వై ద్యం, చిట్కాలు, అంతరిక్షంలోని ఉపగ్రహాల నమూనా, రసాయనాల వాడకంపై విద్యార్థులు ప్రయోగశాలతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ అందుబాటులో ఉందన్నారు. ఇందు కోసం ప్రత్యే క ఉపాధ్యాయురాలిని నియమించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, తులసి, రామకృష్ణ, వెంకటేశ్, సుధీర్‌కుమార్, సబిత పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని శ్రీవాణి ఉన్న పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ భాస్కరుని సుమలత, ఉపాధ్యాయులు మౌనిక , శ్వేత, శ్రీనివాస్, శ్రీలత, స్వామి, బింగి హైమావతి, కపిల్‌దేవ్, బాబు పాల్గొన్నారు.

హరిచరణ్ కృషి ఆదర్శం

తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి 1984-85 పూర్వ విద్యార్థి చెన్నమాధవుని హరిచరణ్‌రాజు అందిస్తున్న కృషి ఆదర్శనీయమని మండల విద్యాశాఖాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా హరిచరణ్‌రాజు రూ.40 వేలు వెచ్చించి సైన్స్ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌ను తన సోదరి శరత్‌కళతో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 1984-85 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని అన్నారు. అనంతరం సైన్స్ ప్రాముఖ్యతపై ఆసనాల శ్రీహరి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పృథ్వీరాజ్, బాలరాజు. నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మీనర్సమ్మ, విజయలక్ష్మితో పాటు సహకారం అందించిన సైన్స్ ఉపాధ్యాయులు యాదగిరి, నిర్మల, జీవనకుమారి, బాలరాజును ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి అభినందించారు.

కోమల్లలో విద్యార్థులతో హెచ్‌ఎం జాన్ సుందర్‌రావు

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : మండలంలోని కోమల్ల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్ సుందర్ రావు మాట్లాడుతూ భారత దేశ మొదటి నోబెల్ బహుమతి గ్రహీత, భౌతిక శాస్త్ర వేత్త సీవీ రామన్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు మాధవి, సంతోష్‌రెడ్డి, పుష్ప, అన్నపూర్ణ, సురేశ్ పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల : మండల కేంద్రంలోని జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు బానోత్ రవీందర్ నేతృత్వంలో నిర్వహించారు. సైన్స్ పితామహుడు పీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలెపు విజయ, గాదె జోసఫ్ బేబీ, ఆవుల ఆమర్‌నాథ్, దొంతుల శ్రీనివాస్, గూడ నాగరాణి, తేజావత్ శ్రీనివాస్, నాగవెల్లి అనిత, అజహర్ సుల్తానా, మారోజు కవిత, పుప్పాల సుమలత, పాకాల కుమారస్వామి, గొపగోని సంధ్య, కౌడ లక్ష్మీనారాయణ, జంగ బాబు, తాటికొండ మహాలక్ష్మి, అనూష, కరుణ, సురేందర్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం, చాగల్లు జడ్పీ హైస్కూల్లో ఫిజికల్, బయోలాజికల్ సబ్జెక్టుల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు ఎగ్జిబిట్లను తయారు చేయించి వారికి అవగాహన కల్పించారు. వ్యాసరచన, క్విజ్, సైన్స్‌కు సంబంధించి పోటీలు నిర్వహించారు. చాగల్లు పాఠశాలలో 9వ తరగతి చదువుచున్న విద్యార్థి వరుణ్ సందేశ్ సీవీ రామన్ వేషాధారణలో ఆకట్టుకున్నారు. ఇప్పగూడెం స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం కేవీ ప్రసాద్, ఆర్ సంధ్యారాణి, శ్యామల, ఎన్ విజయలక్ష్మి, సీహెచ్.లావణ్య, మంజుల, స్వప్న, శ్రీనివాస్, రాజమౌళి, చాగల్లు పాఠశాలకు చెందిన ఇన్‌చార్జి హెచ్‌ఎం అంజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, రంజిత్, శ్రీనివాస్, కొల్లూరి ప్రకాశం పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

కేజీబీవీలో మాట్లాడుతున్న రామారావునాయక్

బచ్చన్నపేట, ఫిబ్రవరి 28 : విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా వ్యవసాయాధికారి రామారావునాయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. వంటశాల, స్టాకు రిజిస్టర్లతోపాటు ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించారు. రామారావునాయక్ మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రతతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. తద్వారా తల్లితండ్రులు, పాఠశాలకు మంచి పేరు వస్తుందన్నారు. విద్యతో పాటు కరాటే, యోగా,ధ్యాన్యంపై వారికి అవగాహన కల్పించేలా శిక్షణ ఇప్పించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి గీత, పంచాయతీ కార్యదర్శి నర్సింహచారి పాల్గొన్నారు

విద్యార్థులకు ఆటవస్తువులు పంపిణీ

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 28 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్‌కు రూ.10 వేల విలువైన ఆట వస్తువులు, డిక్షనరీలు అందించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనొక ప్రకటన చేశారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే జ్ఞాపకశక్తి పెరుగుతుందని, బాగా చదవగలరని పేర్కొన్నారు. విద్యార్థులు ఆటలు, చదువులో ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రంలో హెచ్‌ఎం సంపత్, పీఈటీలు చంద్రశేఖర్, రమేశ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి విజయ్, సభ్యులు వీటి శ్రీనివాస్, గుండెటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి పీసీ సర్కార్ మెమోరియల్ అవార్డు

అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 28 : ఇంద్రజాలంలో అనేక ప్రదర్శనలిస్తున్న మండలంలోని ఇప్పగూడేనికి చెందిన జూలుకుంట్ల (బాంబుల) శ్రీనివాస్‌రెడ్డి ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికులు (సీనియర్) పీసీ సర్కార్ మెమోరియల్ అవార్డు లభించింది. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ సహకారంతో ఆర్కే వండర్ వరల్డ్, తెలంగాణ మెజిక్ అకాడమి సంయుక్తంగా పీసీ సర్కార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి శ్రీమతి సూరెపల్లి నంద, ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాలికులు బీవీ పట్టాభిరాం చేతుల మీదుగా జూలుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డికి అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో మేజిక్ స్టార్ బోస్, సీవీ రమణ, మర్రి రమేశ్, స్టిక్ మనోహర్, రావు, రఘుబాబు, రమ్యశ్రీ పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవంలో టీచర్లతో విద్యార్థులు

చిన్నమడూరు పాఠశాలలో స్వయంపాలన

దేవరుప్పుల, ఫిబ్రవరి 28: మండలంలోని చిన్న మడూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఆర్‌జేడీగా నరేశ్, డీఈవోగా ఉదయ్ కిరణ్, ప్రధానోపాధ్యాయురాలిగా అక్షయ విధులు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జీ కళావతి, ఏపీసీసీ చైర్మన్ శోభ, సీనియర్ ఉపాధ్యాయులు రాజనారాయణ, సత్యనారాయణ, ఆనంద్, వరలక్ష్మి,ప్రసాద్, ప్రవీన్, సుమతి, అంజిరెడ్డి, వసంత, నళిని, సరిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి

ఉద్యోగాలకు ఎంపికైన క్రీస్తుజ్యోతి విద్యార్థులు

జనగామ రూరల్, ఫిబ్రవరి 28 : మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గేస్‌ట్యాప్ ఆటోమోటివ్ చెన్నయ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించిందని ఆయన వివరించారు. బీటెక్ ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అన్‌లైన్ టెక్నికల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, టెలిఫోనిక్ హెచ్ఆర్ టెస్టు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహించారని తెలిపారు. అనంతరం తొమ్మిది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి వార్షిక ప్యాకేజీ రూ.2 లక్షల నుంచి రూ.3.2 లక్షలు వేతనం అందిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధ్యాపకులు అషేర్, సుధీర్, నీలిమ, కరుణాకర్, సరిత పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

సామాగ్రిని పరిశీలిస్తున్న అయిలయ్య

నర్మెట, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను మండల విద్యా శాఖ అధికారి అయిలయ్య శుక్రవారం తనిఖీ చేశారు. భోజనం గది, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సైన్స్ డేను పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటు చేసిన చిత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్, తహసీల్దార్ కేవీ రామానుజాచారి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడిగా రాజు

నర్మెట, ఫిబ్రవరి 28: యాదవ హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చెవుల రాజు యాదవ్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేశ్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ పోరాట సమితి ఆశయాలు, లక్ష్యాలకనుగుణంగా ముందుకెళ్తానన్నారు. యాదవులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

దేవరుప్పుల, ఫిబ్రవరి 28: మండలంలోని కడవెండికి చెందిన సులుగూరి యాదమ్మ(35) విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడవెండికి చెందిన సులుగూరి యాదమ్మ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న కరెంటు మోటర్ స్విచ్ ఆన్ చేసిన అనంతరం వైరు ఇన్సులేషన్ పేలింది. దీనిని గమనించని యాదమ్మ వైరును తాకడంతో షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.